తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మిట్టపల్లి ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచారం

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలంలోని తిర్లావానిబండ వద్ద రెండు రోజులు తిష్ట వేసిన ఒంటరి ఏనుగు సోమవారం కుప్పం మండల ం మిట్టపల్లి ప్రాంతానికి చేరింది. నూలుకుంట పంచాయతీ గంగాలరేవు ప్రాంతం మీదుగా ఒంటరి ఏనుగు మిట్టపల్లి పరిసరాల్లో చేరి సంచరిస్తోందని అటవీ అధికారులు తెలిపారు. కాగా ఒంటరి ఏనుగు ఆదివారం రా త్రి తిర్లావానిబండ వద్ద రైతులు సాగు చేస్తున్న వరి, రాగి పంటలను తిన్నంత తిని ధ్వంసం చేసింది. ఒంటరి ఏనుగును తమిళనాడు అటవీ ప్రాంతంలో తరిమేందుకు చర్యలు చేపట్టినట్లు ఎఫ్ఆర్వో జయశంకర్, డిఆర్వో సమీర్ బాషా తెలిపారు.

పుష్కరిణిలో తెప్ప ట్రయల్ రన్

తిరుమల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తప్రతినిధి:



సాలకట్ల తెప్పోత్సవాలకు ముందు సోమవారం సాయంత్రం స్వామి పుష్కరిణిలో తెప్పల ట్రయల్‌రన్ నిర్వ హించారు. టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. తెప్పోత్సవాలకు తెప్ప లను పూర్తిగా సిద్ధం చేసినట్టు తెలి పారు. ఇంజినీరింగ్, విద్యుత్, ఆలయ అధికారులతో కలిసి తెప్ప సామర్థ్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ట్రయల్ రన్‌లో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇఇలు శ్రీనివాసరావు, సుధాకర్, డిఇ చంద్ర శేఖర్,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ఫస్ట్ ఇయర్ లాంగ్వేజ్ పరీక్షలకు 797 మంది గైర్హాజరు
పరీక్షా కేంద్రాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
నేటి నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాత వార్త

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 84 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ తెలుగు,సంస్కృత భాషా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాలలో ఉదయం 7 గంటల నుంచి విద్యార్థులు,తల్లిదండ్రుల సందడి కనిపించింది.జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తిరుపతిలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి విద్యార్థులను నిశతంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించారు.

తొలిరోజు పరీక్షకు 797 మంది గైర్హాజరు.

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న జనరల్, ఒకేషనల్ విద్యార్థులు తొలిరోజు తెలుగు, ఇంగ్లీష్ పరీక్షకు 31,014 మంది హాజరుకావాల్సి ఉండగా 30,217 మంది హాజరయ్యారని ఆర్ ఐఓ కార్యా లయం తెలిపింది. ఇందులో 797 మంది గైర్హాజరైనట్లు తెలుస్తోంది. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం.

ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా సెకండ్ ఇయర్ విద్యార్థులకు మంగళవారం నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఇంగ్లీష్, సంస్కృతం, హిందీ, ఉర్దూ మాతృభాష పరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 84 పరీక్షా కేంద్రాలలో 30,696 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తెలిపారు.

షరామామూలే....పరుగో... పరుగు...!

తిరుపతి విద్య ఫిబ్రవరి 23 ప్రభాత వార్త

పరీక్షా కేంద్రాల వద్ద షరా మామూలే... పరుగో పరుగు ... సేమ్ సీన్ రిపీట్ అవుతోంది.. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభమైన నేపథ్యంలో పలు పరీక్షా కేంద్రాలలో పదుల సంఖ్యలో విద్యార్థులు పరుగులు పెడుతూ ఆలస్యంగా రావడం కనిపించింది. పరీక్షా కేంద్రం గేటును పోలీసులు, సెక్యూ రిటీ సిబ్బంది మూసివేయడంతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తల్లిదం డ్రులు లోనికి అనుమతించండి సారూ... అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ బ్రతిమలాడుకునే సన్నివేశాలు ప్రతి పరీక్షా కేంద్రంలో కనిపించింది.

కన్నీటిపర్యంతమైన విద్యార్థిని.. అధికారుల అనుమతి

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలంలోని సజ జలపల్లికి చెందిన ఇ ంటర్ ఫస్టియర్ విద్యార్థిని షాలిని కుప్పం లోని ఎంఎఫ్‌సి కాలేజ్‌లో పరీక్షలకు హాజరైంది. ఆమె వచ్చే సమయానికి గేటు వేసి ఉండడంతో కన్నీటిపర్యంతమైంది. విషయం తెలుసుకున్న అధికారులు ఆ విద్యార్థిని సకాలంలో గేటు వద్దకు వచ్చి ఉండడంతో అనుమతించడంతో ఆ విద్యార్థిని ఆనందం వ్యక్తం చేస్తూ పరీక్ష రాసేందుకువెళ్లింది. ఆమె కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

తిరుపతి, ఫిబ్రవరి 23ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్ర శాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును పటి ష్టంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సెంటర్ వద్ద సిఐలు, ఎస్ఐలు , సిబ్బందిని నియమించి, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

కల్తీనెయ్యిపై ఏకసభ్యకమిటీ వైపే మొగ్గు

-ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీం సానుకూలత

తిరుమల,ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల వెంకన్న లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై కేసు తదుపరి విచారణకు ఏకసభ్యకమిటీ చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ధర్మా సనం వెల్లడించింది. దీంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సానుకూలంగా వెల్లడించారు. ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని స్పష్టత రావడంతో కల్తీ నెయ్యి అసలు దోషుల్లో భయంపట్టుకుంది. ఈ కమిషన్ నియామ కాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధరామసనం కొట్టివేసింది. సిబిఐ దర్యాప్తును ప్రభావితం చేస్తుందని భావించడం లేదని, చట్ట ప్రకారం సిట్, ఏకసభ్య కమిటీ తమ తమ విధులను నిర్వర్తించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ఈ రెండు విచారణలు వేర్వేరని, ఒకదాని పరిధిలోకి మరొకటి రాదని తేల్చి చెప్పింది. లడ్డూల కోసం నెయ్యి కొనుగోలు టెండర్లు, నిబంధనల సడలింపులో లోపాలు జరిగాయని సిట్ తన నివేదికలో ప్రభుత్వానికి వెల్లడించింది.. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ సిట్ నివేదిక ఆధారం గా ఎవరిపై, ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్‌తో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ఆదేశించింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దినేశ్‌కుమార్ కమిటీ తన విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

నాయుడుపేట స్వర్ణముఖినదిపై
హైలెవల్ బ్రిడ్జి నిర్మించండి
- శాసనసభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

నాయుడుపేటకు సమీపంలోని తిమ్మాజికండ్రిగ వద్ద ఉన్న స్వర్ణముఖి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం శాసనసభలో ప్రస్తావిం చారు. సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గా లను కలుపుతూ 80వ దశకంలో ఈ ప్రాంతంలో లోలెవల్ బ్రిడ్జి నిర్మించారని అన్నారు. ప్రస్తుతం మేనకూరులో సెజ్ ఏర్పాటు కావడంతో నాయుడు పేట తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది తరచూ ఉద్యోగ రీత్యా మేనకూరు సెజ్‌కు వెళుతున్నారని చెప్పారు. అలాగే ప్రతి నిత్యం సుమారు 300 భారీ వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగానే రాక పోకలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మేనకూరు సెజ్‌లో మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నా యని, దీన్ని దృష్టిలో ఉంచుకుని లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ మంత్రికి ఆమె విజ్ఞప్తి చేశారు.

ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13 రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో గ్రామోత్సవంలో పాల్గొన్న స్వామి అమ్మవార్ల ఉత్సవర్లతో పాటు పంచమూర్తులు,చంద్రశేఖర త్రిశూలంకు సోమవారం షోడషాభిషేకాలు నిర్వ హిం చారు. ఆలయంలోని అలంకార మండపంలో శాస్త్రో క్తంగా ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్ దంపతులు, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి దంపతులు హాజరైసంకల్పం చేసారు. అలంకార మండపంలోని పంచమూర్తులకు ఆలయ అలంకార గురుకుల్, రాజేష్ గురుకుల్, సూరి గురుకుల్ ఆలయ పౌరోహితులు అర్థగిరి స్వామి వేద మంత్రాలను చదువుతుండగా ఆలయ అభిషేక ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్,అచ్చితా స్వామి గురుకుల్ పూజలు జరిపారు. ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, సూరిగురుకుల్, శ్రీనివాసులు గురుకుల్,దక్షిణమూర్తి స్థానిక సంప్రదాయం ప్రకారం షోడషాభిషేకాలు జరిపి శాంతి చేకూర్చారు. శాంతి అభిషేకంతో ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసాయి.ఏర్పాట్లను ఆలయ ఎఇఓ విద్యా సాగర్‌రెడ్డి, మోహన్,టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు వెంకటస్వామి, సుదర్శనం సూపరింటెండెంట్ నాగభూషణంలు పర్యవేక్షించారు.

విద్యుత్ ఘాతంతో రైతు మృతి

బాలాయపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

మండలంలోని వాక్యాం గ్రామానికి చెందిన కొమ్ము గరిటయ్య అనే రైతు విద్యు త్ ఘాతంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పొలంలో విద్యుత్ మోటర్ వేస్తుండగా స్టార్టర్ వద్ద షాప్ తగిలి మృతి చెందాడు. ఎస్సై కామినేని గోపి సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గిరిటయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఇంటి యజమానిని కోల్పోయినట్లు రోధించారు.

వైసీపీ హయాంలో
వెయ్యి ఎకరాల రికార్డులు గల్లంతు?
సీఐడీ దర్యాప్తు చేయాలి : అసెంబ్లీలో ఎమ్మెల్యే కురుగొండ్ల డిమాండ్

వెంకటగిరి, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త

వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలంలో వైసీపీ హయాంలో జరిగిన భూకుంభకోణం గురించి వెల్లువెత్తుతున్న ఆరోపణలు అసెంబ్లీని కుదిపేసింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలువాయిలో జరిగిన భూ కుంభకోణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డులు ట్యాంపరింగ్‌కు గురయ్యాయని ఆయన అసెంబ్లీలో సంచలన ఆరోపణలు చేశారు. కలువాయి వైసీపీ జడ్పీటీసి అనిల్ కుమార్ రెడ్డి కోట్ల రూపాయల లంచాలు తీసుకుని రికార్డుల్లో మార్పులు చేశారని, తహసీల్దార్ స్థాయిలోనే అక్రమాలు జరిగాయని తెలిపారు. చనిపోయిన వారి పేర్లపై డీఫామ్ పట్టాలు సృష్టించడం, అసైన్‌మెంట్ కమిటీ అనుమతి లేకుండానే పట్టాలు జారీ చేయడం వంటి అంశాలు వెలుగుచూస్తున్నాయని చెప్పారు. ఎస్సీల భూములు ఓసీల పేర్లకు బదిలీ చేయడం, అసైన్డ్ భూములను ఒరిజినల్ పట్టాలుగా మార్చడం వంటి తీవ్ర అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. మేత, కాలువ పోరంబోకు భూములు కూడా మినహాయింపు కాలేదన్నారు. నాయబ్రాహ్మణి కాలనీలో లేఅవుట్లు వేసి పేదల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి దొంగ పట్టాలు విక్రయించారని ఆరోపించారు. ఈ భూవివాదాల కారణంగా హత్యాయత్నాలు జరిగి కేసులు నమోద య్యాయని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల గందరగోళం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సీఐడీ దర్యాప్తు ద్వారా అసలు నిజాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ట్యాంపరింగ్‌కు గురైన రికార్డులను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం: కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్య లపై అందిన ప్రతి అర్జీకి నాణ్య మైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో కలెక్టర్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మంలో పాల్గొని ప్రజల నుండి సమ స్యలపై అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, డిఆర్ఓ మోహన్ కుమార్, డిప్యుటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కరుణకుమారి, అనుపమలు, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు హాజరై ప్రజల నుండి సమ స్యలపై అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడువు ముగిసేలోపు సమస్యలపై అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 443 అర్జీలు

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా కలెక్టర్ అర్జీదా రులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పా టుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీ దారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష ్యల్ల వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిరక్ష ్యల్ల వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివ శంకర్ నాయక్, రోజ్మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

అంగన్‌వాడీ వర్కర్ల రిలే నిరాహారదీక్షలు

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలని లేకుంటే తామందరు కలసి కట్టుగా ఛలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరి వస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. జిల్లా ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు రిలే నిరాహారదీక్షలు చేశారు. జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభావతి, సుజనిలు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలన్నారు. నాయకులు గోపినాథ్, మణి, రఘు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయ, ఫరీదా, పుష్ప, అముద, కన్యాకుమారి, భాద్య, బిందు, ఆశ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి విలువలతో కూడిన విద్య అవసరం

-విలువల విద్యా సదస్సులో చాగంటి,జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్త:

సమాజం సమగ్ర అభివృద్ధికి విలువలతో కూడిన విద్య అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు.పాఠ్యాంశాల బోధనతో పాటు నైతిక విలువలను పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజున ఒక చక్కటి ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మానవతా విలువలు తగ్గిపోతున్నాయని ముఖ్యంగా చిన్నపిల్లల స్థాయి నుండే వీటిని అలవర్చుకోవాలన్నారు.సోమవారం మధ్యాహ్నం స్థానిక పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలువల విద్యా సదస్సు లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. పిల్లల్లో సమయపాలన, ఆత్మస్థైర్యం సరిగా ఉండడం లేదని, వాటన్నింటినీ అధిగమించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సిఈఆర్టఇ డైరెక్టర్ యం వి కృష్ణారెడ్డి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఉష, జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్, తిరుపతి అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష జి.గౌరీ శంకర్ రావు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రగిరి కోటలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయాలి

-అసెంబ్లీలో ఎమ్మెల్యే నాని ప్రస్తావనపై హర్షం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:

చంద్రగిరి కోటలో విజయనగర సామ్రాజ్య మహారాజు శ్రీకృష్ణదేవరాయులు విగ్రహాన్ని ప్రతిష్టించి, ఆయన జయంతి జనవరి 17ను అధికారికంగా ప్రకటించి,నిర్వహించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రస్తావించడంపై హర్షధ్వనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయులు గురించి ప్రస్తావించిన ఎమ్మెల్యే పులివర్తి నాని ప్లేక్సీకి మార్కెట్ కమిటీ చైర్మెన్ యు.మౌనికమునిశేఖర్ ఆధ్వర్యంలో తిరుచానూరు మార్కెట్ యార్డులో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ యు.మౌనికమునిశేఖర్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయుల పరిపాలనలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి పలు బంగారు ఆభరణాలు సమర్పించడమే కాకుండా అనుబంధ భవనాల నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలను గుర్తిస్తూ చంద్రగిరి కోటలో విగ్రహం ఏర్పాటు చేసి జయంతిని అధికారికంగా నిర్వహించడం సముచితమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విజయకుమారి, జమున, రమణ, ప్రసన్నసూరి, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, అవిలాల ఉప సర్పంచ్ కవితగోపాల్, ధనంజయులు, బాబురాయల్, రవి, చంద్రశేఖర్, చెంగల్రాయులు, విజయకుమార్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి విస్తృతంగా ప్రభుత్వ వైఫల్యాలు

- పూతలపట్టు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ సునీల్

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భారీ ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితుల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పూతపలట్టు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరులో సోమవారం పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ పార్లమెంటు పరిశీలకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మొగసాల కృష్ణమూర్తిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైకాపా నాయకులపై ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి వేధిస్తోందని, ప్రజలకు ఎలాంటి మేలు చేయడం లేదని ధ్వజమెత్తారు. సమావేశంలో వైకాపా సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా, జడ్పీ వైస్ చైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, హరిరెడ్డిలు, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

యర్రావారిపాలెం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



యర్రావారి పాలెం మండలం, నెరబైలు గ్రామంలోలోని తలకోన వెలసిన శ్రీ సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి టెంపుల్ అసిస్టెంట్ కమీషనర్ బి. ప్రసన్న లక్ష్మి పర్యవేక్షణ లో హుండీను లెక్కేశారు. హుండీ లెక్కింపులో భాగంగా 26 రోజులకు గాను రూ. 6,46,865 ఆదాయం వచ్చినదని అన్నారు. అలాగే అన్నదానం హుండీ ద్వారా రూ. 18,122లు వచ్చాయని తలకోన సిద్ధేశ్వర స్వామి పాలకమండలి చైర్మన్ జె.సోమనాథ రెడ్డి, పాలక మండలి సభ్యులు, జి.రాజన్న, సిరివేలు రమేష్, ఎం.శశికళ, జి. రాజేశ్వరి, ఎన్.ఇందిరా, చెంగమ్మ, శోభా, కె.చలపతి, ఎం. ఈశ్వరయ్య, ఎక్స్ అఫిషియో ఎ.సత్య ప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు ఎ.శివ ప్రసన్న శర్మ, కార్యనిర్వహణాధికారి సి.రవీంద్ర రాజు లు తెలియజేశారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వెంపళ్ల చిన్నయ్య సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీలును అమలు చేయాలని ఇప్పటికే మండల, జిల్లా కేంద్రాలలో ధర్నాలు నిర్వహించామని తెలిపారు. అయినా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. 12వ వేతన సవరణ సంఘం తక్షణమే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని, పెండింగులో ఉన్న డీఏ బకాయిలు చెల్లించి నాలుగు విడతల డి ఏ లను విడుదల చేయాలని, సిపియస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు వంటి ప్రధాన సమస్యలును పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 25న విజయవాడలోని అలంకార ధర్నా కేంద్రం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

గుడుపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో 2026-27సం॥కుగాను ఆరో తరగతిలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు మార్చి నెల 31 వతేది లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హరిణి తెలిపారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థినులకు పరీక్ష రుసుం రూ 125, బిసి, ఒసి విద్యార్థులకు రూ 150లు చెల్లించాల్సి ఉంటుం దన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

నాటుబాంబు నోట కరచి శునకం మృత్యువాత

గుడుపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

కూతవేటు దూరంలో ఉన్న కర్ణాటక ప్రాంతంలో పొలాల వద్ద అడవిపందుల దాడులు అరికట్టేందుకు పొలంలో ఏర్పాటుచేసిన నాటుబాంబును నోటకరచుకున్న ఓ శునకం మృత్యువాతపడింది. మండలంలోని సాలచింతలపల్లికి కూతవేటు దూరంలోనే కర్ణాటక ప్రాంతం ఉంది. ఇటునుంచి వెళ్లిన ఓ శునకం పొలాల వద్ద ఉన్న నాటుబాంబును నోట కరచుకుని వచ్చి అది పేలడంతో మృతి చెందినట్లు అటవీ అధికారులు తెలిపారు.

రోప్ జంప్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

రామకుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి రోప్‌జంప్ పోటీల్లో కెజిబివి విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ అమరావతి తెలిపారు. ఈనెల 22న కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు బంగారు పతకాలు, పన్నెండు వెండి పతకాలు, రెండు కాంస్యపతకాలు సాధించారన్నారు. విద్యార్థినులను ఎంఇఒ నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

పెద్దపంజాణి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన తొమ్మిది ద్విచక్రవాహనాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో చిత్తూరు ఎక్సైజ్ సూపరి ంటిండెంట్ అధ్వర్యంలో బహిరంగవేలం వేయనున్నట్లు ఎస్సై మారెప్ప తెలిపారు

దివ్యాంగులకు శ్రీవారి దర్శనం కల్పించడం మహద్భాగ్యం

- పికెఎం ఉడాఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలోని దివ్యాంగులకు తిరుమల శ్రీవారి దర్శనం కల్పించడం మహద్భాగ్యమని పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం చుక్కల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా॥ వేణుకుమార్ అధ్వర్యంలో నలభైమంది దివ్యాంగులకు కుప్పం నుంచి శ్రీవారి దర్శనయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభి ంచారు. అనంతరం డా॥ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ చుక్కల ట్రస్ట్ ద్వారా దివ్యాంగులకు శ్రీవారి దర్శనం కల్పించడం పట్ల డా॥ వేణుకుమార్‌ను అభినందించారు. ఈతరహా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింతమంది దివ్యాంగులకు శ్రీవారి దర్శనం కల్పించాలని సూచించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు డా॥ వేణుకుమార్ మాట్లాడుతూ 382సోపాన పాదయాత్రలు పూర్తిచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, జిల్లా మహిళా కార్యదర్శి జయమ్మ, దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ డబ్బు జమచేయలేదని చితగ్గొట్టారు

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ప్రైవేట్ ఫైనాన్స్‌సంస్థలో పనిచేస్తున్న ఓ వ్యక్తి పదివేల నగదు జమ చేయలేదని అతన్ని చితగ్గొట్టిన సంఘటన కుప్పంలో వెలుగుచూసింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలిలా.. కు ంజేగానూరుకు చెందిన అశోక్‌కుమార్ కుప్పం బైపాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. బకాయిలుగా వసూలైన పదివేల నగదు అతను చెల్లించకుండా వాడేశాడు. దీంతో అతన్ని ఫైనాన్స్ వారు చితకబాది ఓ గదిలో ఉంచడంతో ఎలాగోలా అతను విషయాన్ని కుటుంబీకులకు చేరవేశాడు. దీంతో వ్యవహారం వెలుగుచూసింది. బాధితుడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాల్లో తప్పక లబ్ది

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో తప్పక లబ్ది కలుగుతుందని కౌన్సిలర్ జిమ్‌దాము పేర్కొన్నారు. సోమవారం 19వ వార్డులో ఆయన ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సమాచారం సేకరించారు. ఏయే పథకాల్లో లబ్ది కలుగుతోంది, ప్రజల సమస్యలు ఏ ంటనే విషయాన్ని నమోదు చేసుకున్నారు.

మల్లానూరులో స్వచ్ఛరథం ప్రారంభం

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని మల్లానూ రులో స్వచ్ఛరథాన్ని ఘన ంగా ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివంలు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ స్వచ్ఛరథాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రజలనుంచి సింథటిక్ వ్యర్థాలను సేకరించి వాటిని బయోగ్యాస్ ప్లాంట్‌కు తరలించడం జరుగుతుందన్నారు. వ్యర్థాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులను వ్యర్థాల విలువను బట్టి అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, కడ సభ్యుడు రామచంద్ర, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, నేతలు విభూషణ్, రమేష్, హైదర్ వలీ, ప్రకాష్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

వివిధ సమస్యల సాధనకై స్థానిక సచివాలయం ఆవరణ ఎదుట ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు సంఘాల అధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నేతలు గంగరాజు, మంజునాథ్ మాట్లాడుతూ మూడేళ్లు దాటిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలసమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నమ్మ, ప్రభావతి, జ్యోతి, సరోజమ్మ, అనిత, నాగరత్న, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ద్వారం మార్చాలని ఫిర్యాదు

బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :స్థానిక ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ ముఖ ద్వారాన్ని తమ ఇంటివైపు ఏర్పాటుచేయడంతో అసౌకర్యంగా భావిస్తున్న వ్యక్తి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. మండలానికి చెందిన దళిత నేత సుబ్రమణ్యం కమ్యూనిటీ హాలు ముందున్న ఇరవై అడుగుల రోడ్డులో కాకుండా తమ ఇంటివైపు ఉన్న ఏడు అడుగుల రోడ్డులో ముఖద్వారం పెడుతున్నారని ఇది రోడ్డు వెనుక ఉన్న కుటుంబాల వారికి అసౌకర్యంగా ఉందని అధికారులకు ఫిర్యాదు చేశాడు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

కాణిపాకం ఆలయానికి లక్ష విరాళం

కాణిపాకం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న అభివృద్ధి పథకాలకు ఓ భక్తురాలు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు విశాఖపట్నంకు చెందిన ఉమశ్రీ గుణకళ అనే భక్తురాలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 50,116 రూపాయలను, గోసంరక్షణ ట్రస్ట్‌కు 50,116 విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసిన జెసి

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. శాంతిపురం మండలం బెల్లకోగిల గ్రామంకు చెందిన ఆర్.విజయరాజ్ జెఎస్ఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 3వ సంవత్సరం అర్కిటెక్ అసిస్టెంట్ కోర్సు చేస్తున్నాడు. ఆర్.విజయరాజ్‌కు జాయింట్ కలెక్టర్ ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, డిఆర్ఓ మోహన్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన సర్వేయర్ కుటుంబానికి కలెక్టర్ చేయూత

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

ఇటీవల మృతి చెందిన సర్వేయర్ ఎ.తులసీరామ్ కుటుంబానికి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ చేయూత అందించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.4.36 లక్షల చెక్కును మృతి చెందిన సర్వేయర్ ఎ.తులసీరామ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కుప్పం రెవెన్యూ డివిజన్ గుడిపల్లి మండలం చీకటిపల్లి గ్రామ సర్వేయర్ ఎ.తులసీరామ్ డిప్యుటేషన్‌పై విజయపురం మండలంలో విధులు నిర్వహిస్తున్నాడు. నగరి ఆర్డీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి సర్వేయర్ తులసీరామ్ హాజరు కావడానికి బైక్‌పై వస్తుండగా ప్రమాదానికి గురై 2025 డిసెంబర్ 19న మృతి చెందాడు. మృతి చెందిన సర్వేయర్ ఎ.తులసీరామ్ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందించడానికి జిల్లా సర్వే ఉద్యోగులు రూ.1.95 లక్షలు, జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్స్ రూ.41 వేలు, కలెక్టర్ తన నిధుల నుండి రూ.2 లక్షలు అందజేశారు. డిఆర్ఓ మోహన్‌కుమార్, సర్వశిక్షాభియాన్ పిఓ వెంకటరమణ, సిపిఓ శ్రీనివాసులు, జిల్లా సర్వే డిపార్ట్‌మెంట్ డిడి టి.జయరాజ్, సర్వే ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కిరణ్‌కుమార్, యోగేష్, చరణ్, జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రమణారెడ్డి, శివయ్యలు పాల్గొన్నారు.

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 సమస్యలు

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడి నిర్వహించిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 36 సమస్యలు అందాయి. ఎస్పీ తుషార్ డూడి ఈ కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జ్ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, డిటిడిసి డిఎస్పీ జె.రాంబాబులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూతగాదాలపై 17, డబ్బు తగాదాలు 6, ఆస్తి తగాదాలు 6, కుటుంబ తగాదాలు 3, చీటింగ్ 2, దొంగతనంపై 2 ఫిర్యాదులు అందాయి.

. ఉచిత కంటి వైద్య శిబిరంలో 62 మందికి పరీక్షలు

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

చిత్తూరు ప్రశాంత్‌నగర్ ఇందిరమ్మకాలనీలో సోమవారం క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు 62 మంది హాజరై వివిధ కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఎంఎస్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు, సిబ్బంది శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ల కోసం 15 మందిని వైద్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు తంగరాజ్, నాయకులు విజయ్, శ్యాంప్సన్, జాషువా, కంటి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నేత అంబటిని కలిసిన చిత్తూరు కాపు నేతలు

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలు జీవితం అనుభవించి వెలుపలికి వచ్చిన మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకులు అంబటి రాంబాబును సోమవారం చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయా నందరెడ్డి ఆధ్వర్యంలో కాపు నాయకులు విజయవాడలో కలిశారు. అంబటి రాంబాబును కలిసిన చిత్తూరు కాపు నాయకుల్లో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు అప్పోజీ, అధికార ప్రతినిధి మధుసూధన్‌రావు, ఉపాధ్యక్షులు ఎంవి రమణ, సీనియర్ నాయకులు జయపాల్, మోహన్, సల్లా రిరీష్, యుగంధర్, శ్రీనివాస్, కాజూరు సుబ్బు, వరద, పెద్దన్న, భరత్, గణేష్ తదితరులు వున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తవనంపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ దిగువమాఘం సెక్టార్ సూపర్‌వైజర్ నాగరత్నం అన్నారు. దిగువమాఘం సెక్టార్ పరిధిలోని అరగొండ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు కిశోరబాలికలకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. . ఈకార్యక్రమంలో స్థానిక ఎంఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోరిబాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

తవణంపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మండలంలోని జొన్నగురకల గ్రామపంచాయతీ కాలనీల్లో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం మండల డిప్యూటీ ఎంపిడీఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జొన్నగురకల కాలనీలో గత కొద్ది రోజులుగా త్రాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కావున అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ ఎంపిడీఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఆయన సోమవారం స్వయంగా గ్రామాన్ని సందర్శించి నీటి సమస్య గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు సమస్య పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంభందిత అధికారులను ఆదేశించారు.

ప్రజల ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు

రామకుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

కుప్పం ప్రాంత ప్రజల ఆరో గ్యం కోసమే సిఎం చంద్ర బాబునాయుడు సంజీవని ప్రాజెక్టు (డిఐఎన్‌సి)అమలు చేస్తున్నారని టిడిపి మ ండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. మండల కార్యాల యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లా డారు. ప్రజలకు నిపుణులైన వైద్యులచే వైద్య పరీక్షలు జరిపి వారి వివరాలు డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు ఆభా పథకంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. అత్యవసర వేళల్లో ప్రజలకు నిష్ణాతులైన వైద్యులచే వైద్య సేవలు అందిస్తారన్నారు కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కామరాజునాయక్, నేతలు నరసింహులు, కృష్ణానాయక్, సీతాపతి, సలాంసాబ్, రఘు, రవిరెడ్డి, పవన్‌కుమార్, సుబ్రి, అల్లిశీను, ఆదిల్, మంజునాథ్, మునీంద్రనాయక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు అడిగితే చర్యలు తప్పవు : సీఐ

ఓబులవారిపల్లి ప్రభాతవార్త ఫిబ్రవరి 23

వాహనదారులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని రైల్వే కోడూరు అర్బన్ సీఐ శ్రీనివాసరావు సూచించారు సోమవారం పెళ్లి మండలం కడప చెన్నై ప్రధాన రహదారి కొర్లకుంట క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ నాయుడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కోడూరు డివిజన్

అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలంటూ అంగన్వాడీలు సోమవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ శ్రీ లక్ష్మీ, ప్రాజెక్టు అధ్యక్షులు శ్రీరామాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం సిడిపిఓ వినతి పత్రం అందజేశామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి జి పద్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధా, డి వనజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కెరీర్‌పై మార్గదర్శక శిక్షణ....

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కెరీర్‌పై మార్గదర్శక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ సహకారంతో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల కోసం ఒక వారం పాటు ప్రత్యేక శిక్షణా తర గతులను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఇంట్రా పర్సనల్ స్కిల్స్,కమ్యూనికేషన్ అండ్ స్టాఫ్ స్కిల్స్ అలాగే పర్సనాలిటీ డెవలప్మెంట్ అంశాలతో శిక్షణను అందిస్తున్నారు. ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య నిర్వాహకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథంను ప్రారంభించిన ఎంపీపీ

పుల్లంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన పుల్లంపేటలో సోమవారం మండల పరిషత్ అధ్యక్షుడు ముద్దా వెంకటసుబ్బారెడ్డి (బాబుల్ రెడ్డి) స్వచ్ఛ రథంను జెండా ఊపి ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా రని, పాత ఇనుము సీసాలు ప్లాస్టిక్ వంటి వాటిని స్వచ్ఛ రథంకు ఇస్తే తిరిగి నిత్యవసర వస్తువులు అందిస్తారన్నారు, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి, ఎంపిడిఓ జయశ్రీ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దినేష్ ఎంపీడీవో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీధర్ పంచాయతీ కార్యదర్శి కరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

పెనగలూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండలంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చక్రంపేట విద్యార్థులకు ప్రముఖ కంటి వైద్య నిపుణులు మరియు ప్రభుత్వ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన కంటి పరీక్షల్లో నందు 25 మంది విద్యార్థులకుకంటి అద్దాలను అందజేశారు.పా

తిరుపతి డివిజన్

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

వడమాలపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: స్విమ్స్ ఆధ్వర్యంలో వడమాలపేట మండలంలోని కల్లూరు గ్రామంలో సోమవారం ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పద్మావతి, హర్షవర్ధన్, సందీప్, సీహెచ్‌వో పురుషోత్తం రెడ్డి, సూపర్‌వైజర్లు మురళి, లలిత, ఏఎన్ఎంలు జస్విన్దర్, శ్యామల, మహాలక్ష్మి, రాధ, వసంత, భారతి తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండికి 59 వినతులు

తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్త: సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 59 వినతులు అందాయి. తిరుపతిలోని కార్పొరేట్ సంస్థ పరిధిలోని తొమ్మిదిజిల్లాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటున్నట్లు ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

పాఠశాలల్లో శక్తి టీం అవగాహన

తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్త: విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యం మరియు సైబర్ అవగాహన పెంపొందించుటకు శక్తి టీం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం దుర్గసముద్రంలోని ఉన్నతపాఠశాలవిద్యార్థులకు పరీక్షల సమయంలో ఒత్తిడి నిర్వహణపై సమగ్రంగా వివరించారు. డ్రగ్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1972, సైబర్ మోసాల నివేదికకు 1930, పోలీస్ హెల్ప్ లైన్ 112 వంటి అత్యవసర నంబర్ల గురించి అవగాహన కల్పించారు.

సమస్యలపై సత్వరం స్పందించండి

తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్త: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 20మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 15 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

చంద్రిక ఆరోపణలు అవాస్తవం!

టిడిపి గ్రామకమిటీ అధ్యక్షుడు రమేష్

చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: భూ కబ్జాకు పాల్పడినట్లు హేమాద్రి భార్య చంద్రిక తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పనపాకం పంచాయతీ, జక్కలవారిపల్లి గ్రామానికి చెందిన నగరం చెంగల్రాయశెట్టి, అలియాస్ రమేష్ ఖండించారు. చంద్రిక పదే పదే తనపై అసత్య ఆరోపణలకు పాల్పడుతూ, తనకు ప్రాణహాని వుందంటూ మీడియాకు చెప్పడంపై సోమవారం ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ భూ వివాదానికి తనకు సంబంధం లేదనీ, ఇక్కడ నాకు సెంటు భూమి లేదన్నారు. షణ్ముగం భార్య జ్యోతి పేరిట 6.5 సెంట్లు వున్నట్లు తెలిపారు. ఈ భూ వివాదం వీరి మధ్యన గత 5 ఏళ్ళుగా సాగుతున్నట్లు తెలిపారు. దీనిపై పెద్దల సమక్షంలో పరిష్కారం చూపించి విఆర్ఓ వ్రాసిన ఒప్పంద పత్రాన్ని హేమాద్రి, చంద్రిక చదివి సంతకం చేసినట్లు తెలిపారు. నేను సర్వేనంబర్ 652/1డిలో 13 సెంట్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. గ్రామ నివాసిగా తాను కొనుగోలు చేసుకున్న భూమిని ఆమెకు వదిలేయాలనీ, లేదంటే కేసులు పెడతానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించారు.

నిరవధిక సమ్మె

తొట్టంబేడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు శ్రీకాళహస్తి డిసిసి బ్యాంకు పరిధిలోని నాలుగు సహకార సంఘాలు తంగేళ్లపాలెం,కోవనూరు,కాటూరు,కాపు గున్నేరు సొసైటీ ఉద్యోగాలు అందరూ కలిసి పాల్గొని నిరవధిక సమ్మెను తమ న్యాయమైన కోరికలు సాధనకై సంఘము నందు టెంట్ వేసి అందరూ నిరాహార దీక్షకు నిరసన తెలియజేసి ధర్నాలో పాల్గొని నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పవ్వు చిరంజీవి రెడ్డి సహకార సంఘం ఉద్యోగిని ఉద్యోగులు శ్రీనివాసులు, శేఖర్ బాబు, వాసు, భాస్కర్, దివ్య రాజశేఖర్, మహేష్, శ్రీనివాసులు సుదర్శన్ రెడ్డి, అరుణ్, సుబ్బయ్య శ్రీనివాసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

తొట్టంబేడు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం కత్తివారికండ్రిగ దళితవాడలో గుర్రప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మాజీ శాసనసభ్యులు ఎస్ సి వి నాయుడు భూమి పూజ నిర్వహించారు. కత్తి వారి కండ్రిక గ్రామంలో శ్రీ గుర్రప్ప స్వామి ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించి ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు సహకారాన్ని అభ్యర్థించారు. నూతన గురప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఎస్సి వి నాయుడు తను వంతు సహాయ సహకారాలు అందించారు. సోమవారం ఆలయ నిర్మాణం భూమి పూజకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సివి నాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సాంప్రదాయ పద్ధతిలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ ఎస్ సి వి నాయుడు చేతుల మీదుగా నిర్వహింపజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

సత్యవేడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ అమాసరెడ్డికండ్రిగ సమీపం దేవాయలం వద్ద అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా దాచి ఉంచినట్టు ఎస్ఐ సాయినాథ్‌చౌదరికి సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సూచన మేరకు సత్యవేడు అడిషనల్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పోలీసు బృందం అమావాస్ రెడ్డి కండ్రిగ దేవాలయం వద్దకు చేరుకుని తనిఖీలు నిర్వహించగా దాచి ఉంచిన రేషన్ బియ్యం బట్టబయలయ్యాయి. ఇందుకు సంబంధించి నాయుడుపేటకు చెందిన మహిళ కల్పనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం 1500 కిలోలు ఉంటుందని, ఈ సందర్భంగా ఎస్ఐ లావణ్య పేర్కొన్నారు. నిందితురాలు కల్పనతో పాటు రేషన్ బియ్యం బస్తాలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. కాగా పోలీసులు స్వాధీనం చేసుకున్నరేషన్ బియ్యం తమిళనాడు ఊత్తుకోట బాషా వ్యక్తిదని విచారణలో తేలిందన్నారు.

పెద్దగంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యులుగా బుజ్జిబాబు

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలసిన శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యులుగా ఆవులపాటి బుజ్జిబాబు నియమితులయ్యారు. నాయి బ్రాహ్మణ కులానికి చెందిన ఆయన రెండేళ్ల పాటు ఆ పదవిలో ఆయన కొనసాగనున్నారు. అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని బుజ్జి బాబు తెలిపారు. బుజ్జి బాబు సేవలను గుర్తించిన జనసేన పార్టీ అధిష్టానం తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యులుగా నియమించారు.

ఎన్ఎస్‌యూలో నక్షత్రవనం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: జాతీయ సంస్కృత వర్సిటీ ప్రాంగణంలోని ఔషధ వనం విస్తరణలో భాగంగా నక్షత్ర వనాన్ని సైతం ఏర్పాటు చేయనున్నారు.ఈ మేరకు సోమవారం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్టార్ గార్డెన్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలదత్తాత్రేయ, డాక్టర్ పి శ్వేత, ప్రొఫెసర్ జేబీ చక్రవర్తి, డాక్టర్ ఆర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ చిరంజీవి, అధ్యాపకులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాలలో సివిల్స్‌పై అవగాహన

తిరుపతి విద్య: ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్, ఎస్ వి వెటర్నరీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు యూపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగే సివిల్స్ సర్వీస్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతి రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న వెటర్నరీ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ అవగాహన సదస్సు ప్రారంభం అవుతుందని తెలిపారు.

వెటర్నరీ హాస్టల్స్‌కు వాటర్ కూలర్, ఫ్రిడ్జ్ వితరణ

తిరుపతి విద్య,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా ఎస్వి వెటర్నటి కళాశాల బాలుర వసతి గృహానికి డబల్ డీప్ ఫ్రిడ్జ్, వాటర్ కూలర్‌ను బహుకరించింది. ఇందులో భాగంగా సోమవారం ఈ మేరకు కళాశాల అధికారులకు ఆ బ్యాంకు తుమ్ములకుంట చీఫ్ మేనేజర్ అంకయ్య, బ్రాంచ్ మేనేజర్ సూర్య ప్రకాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డా.వైకుంఠరావు, వార్డెన్ తిరుపతిరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు .

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేయడం జరిగింది. ఇప్పుడు కూటమి మీ ప్రభుత్వం అధికారానికి వచ్చిరెండు సంవత్సరాలు గడుస్తున్నా అంగన్‌వాడీ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మునికుమారి, విజయకుమారి, రాధా, లలిత, కృష్ణవేణి, గంగులమ్మ, జయంతి, ధనమ్మ, మోహనలక్ష్మి, దుర్గ, గంగులమ్మ, జయంతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రిలే నిరాహారదీక్ష

సత్యవేడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: సత్యవేడు మండల పరిధిలో అంగన్‌వాడీలు తమ డిమాండ్లసాధన కొరకు సోమవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన ధర్నా కార్యక్రమాల్లో కూటమిపార్టీ మద్దతు తెలిపిన తమ ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్, అధ్యక్షురాలు శాంతి, కార్యకర్తలు ఇందిరా, భువన, దివ్య, ఝాన్సీ, మంజుల, లక్ష్మి, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పశు వికాస్ డే

తిరుపతి విద్య,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: ప్రముఖ ఎన్బిఎఫ్సిలలో ఒకటైన ఎస్ఎంఎఫ్జి ఇండియా క్రెడిట్, దాని ప్రధాన పశువుల సంక్షేమం, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం అయిన పశు వికాస్ దినోత్సవం (పీవీడి)న్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ రవి నారాయణన్ మాట్లాడుతూ 2014లో ప్రారంభించబడిన పశువికాస్ దినోత్సవం, ఉచిత పశువైద్య సేవలు మరియు నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందించడం ద్వారా పశువుల యజమానుల కీలకమైన ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తుందన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతి ప్రభుత్వమే నిర్వహించాలి

నింద్ర,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : శ్రీకృష్ణదేవరాయలు జయంతి ప్రభుత్వమే నిర్వహించే విధంగా ప్రత్యేక జిఓను తీసుకొనిరావలేనని బలిజ సంఘ నాయకులు డిమాండ్ చేసారు. సోమవారం మండల కేంద్రంలో నింద్ర మండల తహశీల్దారుకు బలిజ సంఘం నాయకులు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో మండల బలిజ సంఘం కన్వీనర్ కన్నివేలు,నాయకులు జయచంద్రన్, బాలాజీ, క్రిష్ణయ్య, రవి, కుప్పయ్య, కృష్ణ,రూప,చిరంజీవులు,కేశవులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పరీక్షలు

కేవీబీపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో సోమవారం క్యాన్సర్ వ్యాధిపై ఉన్న అపోహలు, అనుమానాలు, వ్యాధి ప్రారంభంలో కనపడే లక్షణాలు, ఎదుర్కొనే ఇబ్బందులు తదితర అంశాలపై ప్రజలకు శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, టాటా ట్రస్టు ఆధ్వర్యంలో సంయుక్తంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్యబాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వెలగపల్లి రెడ్డి, కుమారి, స్టాఫ్ నర్సు, మెహతాజ్, కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి.ఎల్.రామ్‌నాయక్, ఏఎన్ఎం శ్యామల, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందీ ప్రతిభాన్వేషణ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ

కేవీబీ పురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: హైదరాబాద్ హిందీ సేవా సదన్ మహావిద్యాలయ వారు నఇర్వహించిన హిందీ ప్రతిభాన్వేషణ పరీక్షలో కేవీబీ పురం విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐదు మంది బంగారు పతకాలు, ముగ్గురు వెండి పతకాలను గెలుచుకున్నారు. పాఠశాల స్థాయిలో రాణించి డివిజన్ స్థాయిలో ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ఈ బహుమతులను గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో కూడా పరీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్, హిందీ ఉపాధ్యాయులు గోవర్ధన్‌శెట్టి, అనిత, ఇతర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సత్య, సుబ్రహ్మణ్యం, విజయ, బాబు, సీఆర్‌పీ సూపర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Together we can
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
తిరుపతి రేణిగుంట రోడ్డు శాఖ, తిరుపతి

అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన రుణగ్రహీత **శ్రీ ఎస్.మౌనీశ్వర్** గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, తిరుపతి రేణిగుంట రోడ్డు శాఖ, కెనరాబ్యాంక్ వారికి బకాయి వున్న రూ.29,07,321.75/- లను+** వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని **"ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే"** మరియు **"అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై 25.03.2026** న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.

స్థిరాస్తి వివరములు:- చిత్తూరు జిల్లా, పెనుమూరుమండలం, సామిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ, జెట్టిగుండ్లపల్లి సర్వేనెంబర్లు 191/39బి & 191/37బి, డి.నెం.1-24కు సమీపంలో ఉన్న నిర్మాణంలోని నివాసయోగ్యమైన బిల్డింగ్ (జిఎఫ్+ఎఫ్ఎఫ్) శ్రీ ఎస్.మౌనీశ్వర్ పేరున వున్నది. ఫ్లాట్‌కు హద్దులు (పత్రం ప్రకారం): తూర్పు: 20అ. వెడల్పు గల రోడ్డు, పడమర:వై.అరుణ భూమి, ఉత్తరం: జోగీశ్వర్ ఎస్.చక్రపాణి & సి.జయదేవ నాయుడు భూమి దక్షిణం: ఎస్.నిర్మలమ్మ ఇల్లు.

రిజర్వు ధర : రూ.30,70,000.00 ధరావత్తు : రూ.3,10,000.00

ధరావతు సమర్పణకు ఆఖారు తేది & సమయం :23.03.2026 సా.5.00గం॥లకు లేదా ఆలోపు. అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com**లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. **లేదా అధీకృత అధికారి, కెనరాబ్యాంక్, తిరుపతి రేణిగుంట రోడ్డు శాఖ, తిరుపతి, ఫోన్:0877-2500130, 9885378095** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

ప్రదేశం:తిరుపతి, తేది: 23.02.2026 అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

అభివృద్ధి పనుల పరిశీలించిన చినబాబు

విజయపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మండల పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులను సోమవారం సాయంత్రం ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ చినబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్ఆర్ పార్టీ పాలనలో రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలమయమై వాహన చోదకులకే కాక సాధారణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని అన్నారు. అందులో భాగంగానే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో విజయపురం మండల పరిధిలో అవసరమైన మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిపతిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు ధనంజయ యాదవ్, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి ముని భాస్కర్‌రాజు, నాయకులు బాలసుబ్రహ్మణ్యం రాజు, దశరథరాజు, నారాయణ రాజు, ప్రకాష్‌రాజు, బీజేపీ నాయకులు కైలాసం యాదవ్, యుగంధర్‌రాజు, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గారి స్మార కార్థం బొజ్జల-విక్రమ్ విద్యా సంస్థలు ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4వ జాతీయ సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ ఫిబ్రవరి 21 నుండి 27 వరకు దక్షిణ కైలాస్ నగర్‌లోని విక్రమ్ టెన్నిస్ అకాడమీ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుండి సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొని పోటీలు రసవత్తరంగా సాగిస్తున్నారు. విక్రమ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొజ్జల బృందమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్,కరస్పాండెంట్, మునిలక్ష్మి, రామకృష్ణ యాదవ్,రిటైర్డ్ జిల్లా జడ్జి రామకృష్ణ, క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ప్రజల భద్రతకే విజిబుల్ పోలీసింగ్

తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్త: ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు నేరాలను నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్" కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డిఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లలో, రద్దీ ప్రదేశాల్లో, విద్యాసంస్థల సమీపంలో, గ్రామాలు ,పట్టణ ప్రాంతాలలో వాహన తనిఖీలు నిర్వహించారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Together we can
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
సత్యవేడు శాఖ, సత్యవేడు, తిరుపతి జిల్లా

అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన రుణగ్రహీత **శ్రీ అమల్ వర్గీస్** మరియు గ్యారంటారు **అఖిల్ ఆంటోని** గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, సత్యవేడు శాఖ, కెనరాబ్యాంక్ వారికి బకాయి వున్న రూ.15,91,002.15పై లను+** డిమాండ్ నోటీసు తేది:22.05.2025 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని **"ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే"** మరియు **"అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై 25.03.2026** న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.

స్థిరాస్తి వివరములు:- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, తడ మండలం మరియు గ్రామపంచాయతీ, తడకండ్రిగ గ్రామం, చెంగాలమ్మ నగర్ నేషనల్ హైవే -5 రోడ్డుకు తూర్పు వైపు సర్వేనెం.114/4ఎ లోని ఫ్లాటు నెం.38 స్థలం పూర్తి విస్తీర్ణం 234.24 చ.గ.లలో నిర్మించిన "కె.కె.వి. అవెన్యూ" లోని ఫ్లాట్ నెం.301 (2వ అంతస్తు) యొక్క అవిభాజ్యవాటా విస్తీర్ణం 16.73 చ.గ.లు శ్రీ అమల్ వర్గీస్ పేరున వున్నది. ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఫ్లాట్ నెం.302, పడమర: జాయింట్ మెట్లు & కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై స్థలానికి హద్దులు: తూర్పు: లేఔట్ ఫెన్సింగ్, దక్షిణం: 23అ. వెడల్పు గల లేఔట్ రోడ్డు, పడమర: ఫ్లాటు నెం.37 ఖాళీ స్థలం, ఉత్తరం: లేఔట్ ఫెన్సింగ్

రిజర్వు ధర : రూ.10,00,000.00 ధరావత్తు : రూ.1,00,000.00

ధరావతు సమర్పణకు ఆఖారు తేది & సమయం : 23.03.2026 సా.5.00గం॥లకు లేదా ఆలోపు. అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com**లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. **లేదా సీనియర్ మేనేజర్, కెనరాబ్యాంక్, సత్యవేడు శాఖ, తిరుపతి, ఫోన్: +91 9966445144** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

ప్రదేశం:సత్యవేడు, తేది: 21.02.2026 అధీకృత

రెవిన్యూ క్లినిక్‌లో పరిష్కారం విఫలం

వాకాడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ ఎన్నో సమస్యలు వచ్చినటువంటి రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమయ్యారని జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలోని తాహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌ను జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరావు మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వములో కూడా బిజెపి, టిడిపి, జనసేన నాయకులు ఇచ్చినటు వంటి అర్జీలపై ఇప్పటివరకు పరిష్కారం కాకపోవడం ఏమిటని తహసిల్దారును పురుషోత్తంరెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ క్లినిక్‌లో వచ్చినటువంటి అర్జీలపై వెంటనే స్పందించి తహసిల్దార్ ద్వారా పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుని బాధితులు అండగా భరోసా ఇవ్వాలని, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, పనబాక కోటేశ్వరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ వల్లి ప్రసాద్ తదితరులు బిజెపి నాయకులు ఉన్నారు.

- తహశీల్దార్ వివరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ క్లినిక్‌లో భాగంగా వచ్చినటువంటి అర్జీలుకు కొంత సమయం ఉంటుంది. ఆ గడువులోపు అర్జీలు తన దృష్టికి వస్తే త్వరితగతిన విచారించి పరిష్కరిస్తానని తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ వివరణ ఇచ్చారు.

కల్తీ నెయ్యి చేసిన పాపం వైసిపిదే

వెంకటగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: అనుమతి లేకుండా ర్యాలీలు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని బండబూతులు తిడితే.. మేము చూస్తూ ఊరుకోవాలా అంటూ మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలకు తావులేదని, చట్టం తన పని తానే చేసుకుంటుందని స్పష్టం చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిరసన పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు శాంతియుతంగా వినతిపత్రాలు సమర్పిస్తుంటే, వెంకటగిరిలో మాత్రం అనుమతి లేకుండానే సుమారు 500 మందితో ర్యాలీ చేపట్టి ఎన్‌హెచ్565పై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని ఆరోపించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పులుకొల్లు రాజేశ్వరరావు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోగలమోగానీ ఆ దేవదేవుడు నుంచి మాత్రం తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టే సంస్కృతి తమది కాదని వైసీపీ నేతలు గతంలో టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి సైకో ఆనందం పొందారని దుయ్యబట్టారు. సమావేశాల్లో కౌన్సిలర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

జంబ్లింగ్ విధానంలో అవకతవకలను సరిచేయండి

సూళ్ళూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ పరీక్షలలో జంబ్లింగ్ విధానంలో జరిగిన అవకతవకలను సరిచేయాలని సత్యం కాలేజి అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు సోమవారం తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 227 మంది విద్యార్థులను విక్రమ్ కాలేజిలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసేందుకు అనుమతించారన్నారు. కాగా, ఈ కేంద్రంలో విక్రమ్ కళాశాలకు చెందిన అధ్యాపకులనే ఇన్విజిలేటర్లుగా వేయడం సరికాదని తెలిపారు. తక్షణమే ఈ కేంద్రంలో ప్రభుత్వ అధ్యాపకులను ఇన్విజిలేటర్లుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే సూళ్ళూరుపేటలో మొదటి రోజున 778 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా, ఇందులో 39 మంది గైర్హాజరు అయ్యారు. డిఎస్పీ చెంచుబాబు నేతృత్వంలో పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

వెంకటగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త ప్రభుత్వం వెంటనే కొత్తగా ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్‌ను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వడ్డీపల్లి చంగయ్య కోరారు. వెంకటగిరి పట్టణంలోని అంగన్వాడీ కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షులు పి. లక్ష్మి ప్రసన్న నాయకులు, వరలక్ష్మి, రమ, నిర్మల, ప్రభావతి, సుభాషిని, ఉష, రమణమ్మ, అన్నపూర్ణ, మమ్ముల బేగం, తులసి, సుగుణ, రాజేశ్వరి, సుకన్య, విజయ,పాలమ్మ, సుమతి, నవమణి, జయంతి, పి లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఫోటో

గిట్టుబాటు ధరలు కల్పించాలని ధర్నా

వెంకటగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం వారు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వెంకటగిరి తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిపి అనంతరంకి తహసిల్దార్‌కి మెమోరాండం అందజేసారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ రైతు అని చెప్పే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బడ్జెట్లో రైతాంగానికి అరకొర నిధులు కేటాయించి రైతాంగం సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యే అని కౌలు రైతులకు బకాయిలను వెంటనే చెల్లించాలని పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లిపాడు బాలకృష్ణయ్య మాట్లాడుతూ డిమాండ్లు రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయానికి 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రస్తుత సంవత్సర బకాయిల కింద సుమారు 27,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలి భూమిలేని కౌలు రైతులకు రావాల్సిన సుమారు 3,500 కోట్లు బకాయిలు వెంటనే వారి ఖాతాలో జమ చేయాలన్నారు. ఈ అంశాలను పునః పరిశీలించి బడ్జెట్లో మార్పులు చేయాలని కోరారు.

పరశురామేశ్వరాలయ భక్తులకు బస వసతి భూమి పూజ

ఏర్పేడు,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల భాగస్వామ్యంతో బస వసతి కల్పించుటకు భవన నిర్మాణానికి భూమి పూజలు జరిపారు. సోమవారం జరిగిన కార్యక్రమాలకు అతిథిగా ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరినాయుడు హాజరయ్యారు. ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ధర్మకర్తల మండలి సభ్యులు హాజరయ్యారు. భక్తుల బస సదుపాయానికి మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ వారి వారి సొంత ఖర్చులతో భవన నిర్మాణం చేయటానికి నిర్ణయించారు. దాంతో సుమూహూర్తంలో భవన నిర్మాణానికి నిర్ణయించారు. భూమి పూజల కార్యక్రమాల్లో చైర్మెన్ బత్తల గిరినాయుడు దంపతులు పాల్గొన్నారు.భూమి పూజ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పాలకమండలి సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

తొట్టంబేడు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: అంగన్వాడి సమస్యలను పరిష్కరించేంత వరకు ఐఎఫ్టియు, సిఐటియు, ఏఐటియుసి పోరాటం కొనసాగుతుందన్నారు. డివిజన్ కార్యదర్శి స్వరాజ్యలక్ష్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో అంగన్వాడీల సమస్యలను తాము అధికారులకు వచ్చిన మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు పట్టించుకున్న పాపాన పోలేదని ఈ నేపథ్యంలో వారి సమస్యలు అన్ని పరిష్కరించే వరకు పోరాటం కొనసాగు తుందని అన్నారు. డివిజన్ ఉపాధ్యక్షులు స్వర్ణ మాట్లాడుతూ. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలనీ, గ్రాట్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా, సిఐటియు, ఏఐటియుసి ఐఎఫ్టియు యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు జహీరా, లక్ష్మి, దివ్య, రేష్మ, మోహన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: అయోడిన్ లోపం నివారణకై చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శిరీషా తెలిపారు. మండల పరిధిలోని గంగుడుపల్లి, మల్లయ్యపల్లి గ్రామాలలో సోమవారం రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్య సిబ్బంది పిల్లలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు, సర్వే నిర్వహించారు. అయోడిన్ లోపం వలన కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సర్వేకి సహకరించిన పేరెంట్స్‌కు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ శివరాజు, ఎంపిహెచ్ఎస్ వాసుదేవరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిఎస్ దీపిక, ఏఎన్ఎంలు శివకుమారి, సంధ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: అంగన్‌వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటియూసి జిల్లా నాయకుడు కెవై రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు వాణీశ్రీ, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగరాజమ్మ, కార్యదర్శి కె.నాగరాజమ్మ, నాయకులు మంగమ్మ, సుజాత, ఆసిఫా షబీనా, రాజేశ్వరీ, శోభ, రేణుక, మహేశ్వరీ, జయలలిత, సిఐటియు అమరావతి, సుభాషిణి, పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఔషధాల వినియోగంపై అవగాహన కలిగివుండాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: రిపీడ్ ఆధారిత ఔషధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రొఫెసర్ జె.బాబు రామాపురం అన్నారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో సోమవారం వినూత్న ఔషధాల పంపిణీ కోసం రిపీడ్ ఆధారిత సూత్రాలు అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కబళించిన కజారియా

-ఆందోళనలో దళితులు,పరిశీలించిన ఆర్‌డిఓ

తొట్టంబేడు,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మండలంలోని గౌడమాలకు వెళ్ళే రోడ్డును కజారియా ప్రైవేటు కంపెనీ ఆక్రమించుకుంటే దానికి అధికారులు మద్దతుగా నిలవటంపై గ్రామస్థులు శివమెత్తారు. సమస్యను సోమవారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. గౌడమాలకు సుమారు 60 సంవత్సరాల నుంచి రోడ్డు మార్గం ఉండేది. దళితులకు సంబంధించిన ఈ రోడ్డును కజారియా కంపెని ఆక్రమించుకొనుటకు రెవెన్యూ అధికారులు కంపెనీకి మద్దతుగా నిలచి దళితుల రోడ్డుకు అన్యాయం చేసారని వాపోయారు.ఈ రోడ్డు మీదనుంచే సచివాలయానికి రేషన్ షాపుకు దారి అని వివరించారు.

వ్యవసాయ అనుబంధ రంగాలను ఆదుకోవాలి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని, అదే విధంగా అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ సిపిఐ పార్టీ నాయకులు సోమవారం తడ మండల తహసిల్దార్ శరత్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ తిరుపతి జిల్లా రైతు సంఘం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీలలో అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం అమలులో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు.కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు కుమార్, శేఖర్, రమేష్ పరమశివం ఎలుమలై తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్‌కు మరమ్మతులు చేయండి మహాప్రభో!

నాయుడుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో ఏది కారణమైతేనేమి సుమారు 45 సంవత్సరాలు క్రితం నిర్మించిన వాటర్ షెడ్ మరమ్మతులు చేయాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు. గతంలో రెవిన్యూశాఖ మంత్రిగా ఉన్న దివంగత నేత నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించిన మంచినీటి సరఫరా భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. తాగునీటికి ప్రాధాన్యతనిస్తూ వేలాది మంది కాలనీవాసులకు దాహత్తిని తీరుస్తున్న ఈ భవనం ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉందని కాలనీవాసులు అంటున్నారు. ఆ ప్రాంతవాసులు ఈ భవనాన్ని మరమ్మతులు చేయాలని పలుమార్లు పాలకులను అధికారులను కోరిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యపై స్పందిస్తూ ఆ కాలనీవాసులు గోవిందు వాసు, హజరత్, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, రవణమ్మ. తదితరులు తక్షణం మరమ్మతులు చేపట్టి మోటారు విద్యుత్ పరికరాలను కాపాడి నిరంతరం త్రాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని సూళ్ళూరుపేట నియోజకవర్గం శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీను, నాయుడుపేట పట్టణ అధ్యక్షులు షేక్ రఫీను అధికారులను కోరారు.

స్థలం కోసం అధికారులకు వినతిపత్రం

నాయుడుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంటు నాగూరయ్య ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులతో జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అందుబాటులో లేని కారణంగా డిఆర్ఓ నరసింహులుకు రోటరీ క్లబ్‌కు స్థలం మంజూరు చేయమని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజన్ అధికారి కిరణ్మయి వారికి సభ్యులందరూ సూళ్ళూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించి వినతి పత్రము అందించి ఆర్డీవో స్థలము ఐదు సెంట్లు మంజూరు చేసేందుకు సుముకత వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య, రోటరీ క్లబ్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ సభ్యులు హరి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు

నాయుడుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాయుడుపేట ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నాయుడుపేట, పెళ్ళాకూరు, ఓజిలి మండలాల అంగనవాడిలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శివకవి ముకుంద, అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను చులకనగా చూస్తున్నాయన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, జిఏఎస్ అమలు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు.అంగన్వాడిల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు సిఐటియు అండగా ఉంటుందన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

డక్కిలి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : మండల ప్రజలు తమ సమస్యల సాధన కోసం కార్యాలయాలు చుట్టూ తిరగకుండా వాటిని త్వరితగతిన పరిష్కరించాలని డక్కిలి తహశీల్దారు ఎం.శ్రీనివాసులు తెలిపారు.స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో డక్కిలి ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రాంగణంకు స్థలం కేటాయించాలని డక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఎంఈవోలు కిల్లా వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబులు తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు.అందుకు ఆయన స్పందిస్తూ ఈ విషయాన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.సిబ్బంది పారదర్శకతతో పనిచేయడంతో పాటు సమస్యలు పరిష్కారంలో వేగవంతం ఉండాలని తగు ఆదేశాలు ఇచ్చారు.ఈకార్యక్రమంలో పలు శాఖలకు సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

26న దేవస్థానం మహాసంప్రోక్షణ

సూళ్ళూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: సూళ్ళూరుపేటలోని శ్రీ మద్వేంకట రామమూర్తి దేవస్థానాన్ని ఇటీవలే పునర్నిర్మించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి ఈ నెల 26న మహాసంప్రోక్షణ, మహాకుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 24 నుంచి ప్రత్యేక పూజలు, హోమాలతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 26న సాయంత్రం మహా సంప్రోక్షణ, కుంభాభిషేకాల తర్వాత శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహిస్తారు. భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ వారు కోరారు.

ముక్కంటి అనుగ్రహంతోనే ఏదైనా సాధ్యం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని అనుగ్రహం ఉంటే ఎంత పెద్ద కార్యక్రమాలనైనా సునాయాసంగా విజయవంతం చేయవచ్చునని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి అన్నారు. సోమవారం బ్రహ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 13రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయన్నారు. విమర్శలు, వివాదాలకు చోటు లేకుండా భోళాశంకరుడు అధికారుల చేత విజవంతం చేయించుకున్నారని వివరించారు. సభకు అధ్యక్షతన వహించిన ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే పౌర్ణమికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గిరిప్రదిక్షణకు రావటానికి అంగీకారం తెలిపారని సభలో ప్రకటించారు.ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వశాఖల సమన్వయానికి కలెక్టర్ దిశ దెశ నిర్దేశం ఎంతో ఉపయోగ పడిందన్నారు. అందరి సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంత మయ్యాయన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవవాని ప్రసాద్ మాట్లాడుతూ తనకు మొదటి శివరాత్రి అని అయితే ఉత్సవాల్లో పనులకు ఇఓ బాపిరెడ్డి సహకారం వర్ణించలేదనిదన్నారు. శ్రీకాళహస్తి డియస్‌పి నరసింహామూర్తి మాట్లాడుతూ తాను ఇది రెండవ శివరాత్రి అని గతానుభవాలను తమ శాఖ ఎస్‌పికి వివరించానని ఆయన ప్రణాళికలతో నేరాలు జరగకుండా భక్తుల మనోభావాలను కాపాడగలిగినామని ఈ సంతృప్తి మరెప్పుడూ రాదన్నారు.పోలీసు శాఖ శివరాత్రి సందర్భంగా చక్కగా పని చేసి ప్రజల మన్ననలను అందుకున్నారన్నారు.ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ సారధ్యంలో ఇఓ బాపిరెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులను సత్కరించారు.

సిబ్బంది సేవలకు సత్కారం:

శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించటంలో, సకాలంలో ఉత్సవాలను నిర్వహించటంలో, అతిథులకు సేవలందించటంలో కృషి చేసిన సిబ్బందిని ఇఓ బాపిరెడ్డి, చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్‌లు సత్కరించారు. ఆలయంలో పూజలు నిర్వహించటంలో సమయపాలనను పాటించిన అభిషేక ప్రధాన గురుకుల్, డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, పౌరోహితులు అర్థగిరి, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్, అలంకారాలు సకాలంలో నిర్వహించటంతో కృషి చేసిన రాజేష్ గురుకుల్, సూరి గురుకుల్స్ సన్మానించారు. ఇక ఉత్సవాలను సమయ పాలనతో సకాలంలో తీసుకురావటంతో ముందుకు నడిపించటంలో రేయింబవళ్ళు కృషి చేసిన టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి,ఆలయానికి వచ్చిన అతిథులను దర్శనాలు చేయించటంలో జవాబుదారి తనంతో వ్యవహరించిన టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, భక్తులకు కావవాల్సినన్ని ప్రసాదాల తయారిలో కార్మికులను సమన్వయం చేసుకొని ఆలయానికే కాకుండా గుడిమల్లం, అర్ధనారీశ్వరాలయానికి అందించటంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా విధి నిర్వహించిన హరియాదవ్‌లను సత్కరించారు. కాగా వచ్చిన అతిథులకు ఆతిథ్యం కల్పించటంలో మీడియాను సమన్వయం చేసుకోవటంతో చొరవ చూపిన ఎఇఓ మోహన్, ఆలయంలో ప్రోటోకాల్ పాటించిన మరో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎపిఆర్ఓ రవి, పరిపాలనలో ఫైళ్ళను సకాలంలో అందించటంతో కృషి చేసిన డెప్యూటి కార్యనిర్వహణాధికారి ఎన్ ఆర్ కృష్ణారెడ్డిని సత్కరించారు. కాగా సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహించటంలో ధూర్జటి వేదికను చక్కగా నిర్వహించిన ఎఇఓ హేమామాలిని, విజయసారధిలను సత్కరించారు.

భౌగోళిక పాఠ్యాంశాల్లో కృత్రిమ మేధను చేర్చాలి

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : భౌగోళిక పాఠ్యాంశాలలో కృత్రిమ మేధస్సును అనువర్తింపచేయాల్సిన అవసరం ఉందని వీసీ టాటా నర్సింగరావు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ భూగోళశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి వికసిత్ భారత్ కోసం నీరు, నేల వనరుల నిర్వహణలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ అనే అంశంపై మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు సోమవారం సెనేట్ హాల్లో ప్రారంభమైంది. ఈ సమావేశానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి అతిథులు, అధ్యాపకులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి కొరత, నేల క్షీ ణత, వాతావరణ మార్పు, స్థిరమైన వనరుల నిర్వహణ వంటి సమకాలీన సవాళ్లను పరిష్కరించడంలో జియో స్పేషియల్ టెక్నాలజీలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలిపారు. స్థిరమైన అభివృద్ధి, ఏఐ, రిమోట్ సెన్సింగ్, అధునాతన డేటా విశ్లేషణల మద్దతుపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. భౌగోళిక విద్యా అభివృద్ధి చెందుతున్న అధునిక సాం